క్లుప్తంగా

లక్ష్మీచెన్నకేశవుడికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకారంలో చెన్నకేశవస్వామి

మార్కాపురం టౌన్: పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీలక్ష్మి చెన్న కేశవ స్వామి వారికి అర్చకులు శనివారం ప్రత్యేక పూజలను చేశారు. ఉదయం స్వామి వారి మూల విరాట్‌కు అర్చకులు ఆధ్వర్యంలో అభిషేకాలు, విష్ణు సహస్రనామ పారాయణం, అష్టోత్తర పూజలు, అర్చన చేశారు. అలాగే రాజ్యలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందించారు. కార్యక్రమంలో ఈవో శ్రీనివాసరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

21న వెలుగొండలో వస్తు విక్రయ వేలం

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు పురస్కరించుకొని పలు రకాల వస్తువులు విక్రయించుకునేందుకు ఈనెల 21వ తేదీన వెలుగొండస్వామి దేవస్థానంలో బహిరంగ వేలం పాట నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఏడాది మార్చి నెల 13వ తేదీ నుంచి 25వ తేదీ వరకు జరిగే శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా పూజా ద్రవ్యాలు, కొబ్బరికాయలు అమ్ముకొనేందుకు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకొనేందుకు, అలాగే బ్రహ్మోత్సవాలు ముందు రోజు నుంచి మళ్లీ వచ్చే ఏడాది బ్రహ్మోత్సవాలు ముందు వరకు తలనీలాలు పోగు చేసుకునేందుకు వేలం నిర్వహిస్తున్నట్లు వివరించారు. వేలంలో పాల్గొనే వారు ముందుగా రూ.10 వేల ధరావత్తు చెల్లించాలని, వేలం పూర్తయిన వెంటనే హక్కుదారులు పూర్తి మొత్తాన్ని చెల్లించాలని వారు స్పష్టం చేశారు. వివరాలకు 80999 49996 సంప్రదించాలని ఈవో కోరారు.

ఘనంగా సంత్ సేవాలాల్ జయంతి


సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కంభం: బంజారాల, సుగాలీల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతిని శనివారం కంభంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అర్ధవీడు ఎంఈఓ లక్ష్మీనాయక్, దంతవైద్యుడు డాక్టర్ దశరథ్‌లు మాట్లాడుతూ బంజారాలు అన్నిరంగాలలో అభివృద్ధి చెందేందుకు కృషి చేసిన ఆధ్యాత్మిక వేత్త సేవాలాల్ మహారాజ్ అని కొనియాడారు. బంజారాలు ఆయన చూపిన మార్గంలో నడవాలని కోరారు. అనంతరం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రాము, అంజి, కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరి చేయిస్తే క్రిమినల్ చర్యలు


ర్యాలీలో పాల్గొన్న తహశీల్దార్ చిరంజీవి, అధికారులు


మార్కాపురం: చిన్నపిల్లలతో వెట్టిచాకిరి చేయిస్తే క్రిమినల్ కేసులు నమోదుచేస్తామని తహశీల్దార్ చిరంజీవి హెచ్చరించారు. బంగారు బాల్యం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆయన అధికారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కోర్టు సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ బాల కార్మికులను ఎవరు పనిలో పెట్టుకున్నా వారిని శిక్షిస్తామన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలను కచ్చితంగా బడికి పంపాలని, పనికి పంపవద్దని సూచించారు. కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతోపాటు ఎంఈఓ శర్వాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజరు బుజ్జి, అంగన్‌వాడి టీచర్లు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

కంభం: గురుకుల పాఠశాల, కళాశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి 5వ తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పీ చాముండేశ్వరి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో చేరే విద్యార్థులు 4వ తరగతి పూర్తి చేసి ఉండి ఎస్సీ, ఎస్టీ విద్యార్థులై 01 సెప్టెంబర్ 2012 నుంచి 31 ఆగస్టు 2014 లోపు జన్మించి ఉండాలన్నారు. ఇంటర్మీడియట్‌కు విద్యార్థులైతే పదో తరగతి మొదటి సారే పాసై ఉండాలని, సీటు కోసం తమ జిల్లాల్లోనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.1 లక్ష లోపు ఆదాయం ఉండాలని తెలిపారు. ఏప్రిల్ 6న ఉదయం 5వ తరగతి విద్యార్థులకు, సాయంత్రం ఇంటర్ విద్యార్థులకు రాత పరీక్ష ఉంటుందన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పూర్తి వివరాలకు 78158 05491 నంబరును సంప్రదించాలని ఆమె ప్రకటనలో కోరారు.


కాలనీలో స్తంభాలు లేకపోవడంతో చీకటిగా ఉన్న వీధి..


దరగా గ్రామంలోని ఓ వీధిలో రోడ్డుపై పారుతున్న మురుగు


పగటి పూట వెలుగుతున్న వీధిదీపాలు

వీధులా.. మురికి కూపాలా !

- కంభం మండల గ్రామాల్లో దారుణంగా పారిశుద్ధ్యం
- దరగాలో వీధుల్లో పారుతున్న మురుగునీరు
- వీధిలైట్లు లేక కాలనీలో చీకట్లు
- పట్టించుకోని అధికారులు

కంభం: గ్రామాలు కంపుకొడుతున్నాయి. ఏ వీధి చూసినా మురుగు, చెత్తచెదారంతో నిండిపోతున్నాయి. ఫలితంగా సీజనల్ వ్యాధులు తగ్గిపోయినా విషజ్వరాలతో ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని దరగా గ్రామంలో పారిశుద్ధ్య అధ్వానంగా ఉంది. గ్రామాల్లో డ్రైనేజి కాలువలు లేకపోవడంతో ఇళ్లల్లోని మురుగునీరంతా రోడ్లపైనే పారుతోంది. గ్రామాల్లోని అంతర్గత రోడ్లు సిమెంటు రోడ్లు ఉన్నప్పటికి ఇరువైపుల డ్రైనేజి కాలువలు లేవు. ఈరోడ్లపైనే రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పలుమార్లు ద్విచక్రవాహనదారులు బురదలో జారి కిందపడి గాయాలపాలయ్యారని స్థానికులు చెప్తున్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలంటూ స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి ఫొటోలు దిగి ఉన్నతాధికారులకు పంపించే పంచాయతీ అధికారులకు మా గ్రామం కనిపించడం లేదా అని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పంచాయతీ అధికారులు వచ్చి వెళ్తున్నారే తప్పా సమస్యను పరిష్కరించడం లేదని వాపోతున్నారు. గ్రామంలో ఉన్న విద్యుత్ స్తంభాలకు 24 గంటలు వీధిలైట్లు వెలుగుతుండటంతో కరెంటు వృథా అవుతుందని, రాత్రి పూట మాత్రమే లైట్లు వెలిగేలా పంచాయతీ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కాలనీలో కొన్ని చోట్ల విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో రాత్రి పూట ఇబ్బందిగా ఉందంటున్నారు. కొండకు ఆనుకొని ఉన్న గ్రామం, చిల్ల చెట్లు అధికంగా ఉండటంతో పాములు, ఇతర విష కీటకాలు తిరుగుతున్నాయని విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి లైట్లు వేయించాలని కోరుతున్నారు.


గుడి సమీపంలో సిమెంటు రోడ్డుపై నిలిచిన మురుగు

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డులు

బేస్తవారిపేట:

సాక్షి ఎఫెక్ట్..

బేస్తవారిపేటలోని దరగ రోడ్డు వెంట విలువైన ప్రభుత్వ స్థలాలు ఆక్రమణకు గురవుతున్నా రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు. దీనిపై సాక్షిలో ఈనెల 12న 'కళ్లు మూసుకున్నాం..కబ్జా చేసుకోండి' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి రెవెన్యూ అధికారులు స్పందించారు. వీరాంజనేయస్వామి ఆలయం సమీపంలో, డ్వామా సీఎల్ఆర్‌సీ భవనం సమీపంలో రోడ్డు పక్కన లక్షల విలువైన స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. ఈ మేరకు రెవెన్యూ అధికారులు ఆక్రమణ స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూమి ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.


ఆక్రమిత స్థలంలో ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

వనరుల సంరక్షణలో చైతన్యం అవసరం


వేములకోట ర్యాలీలో పాల్గొన్న ప్రజలు


సోమవారిపేటలో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు


ఈగలపాడులో పనులను ప్రారంభిస్తున్న అధికారులు

పొదిలి రూరల్: వనరుల సంరక్షణకు ప్రజలను చైతన్యపరచాలని మండల స్పెషలాఫీసర్ విద్యాసాగర్ అన్నారు. శనివారం పొదిలి మండలంలోని ఈగలపాడు గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న ఇంకుడు గుంతల నిర్మాణ పనులను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పొదిలి మండలానికి 380 ఇంకుడు గుంతల మంజూరైనట్లు చెప్పారు. వీటి నిర్మాణం వలన మురుగు నీటి సమస్య తీరేందుకు, భూగర్భ జలాలు పెరుగుదలకు ఇంకుడు గుంతలు ఉపయోగపడుతాయని ప్రజలు వివరించారు. ప్రతి ఇంకుడు గుంతకు ఉపాధి హామీ కింద రూ. 6 వేలు వస్తాయన్నారు. ప్రతి నివాసం దగ్గర ఇంకుడు గుంత తప్పనిసరిగా ఉండాలని ప్రభుత్వం చెప్పిందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శోభన్‌బాబు, ఏపీవో వెంకట్రావు, ఈఓ శివకుమార్, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

భూగర్భజలాల వృద్ధి..

బేస్తవారిపేట: ఇంకుడు గుంతలతో భూ గర్భజలాలు వృద్ధి చెందుతాయని డ్వామా ఏపీడీ ఎస్ భాస్కరరావు అన్నారు. శనివారం మండలంలోని సోమవారిపేటలో ఇంకుడు గుంతల నిర్మాణాలను ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులతో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఏవీ రంగనాయకులు, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ గురువరకుమార్, ఎన్ఆర్ఈజీఎస్ ఈసీలు, టీఏ, ఎఫ్ఏలు పాల్గొన్నారు.


గోపాలునిపల్లెలో భూమి పూజ చేస్తున్న ఎంపీడీవో మస్తాన్‌వలి

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదాం..

మార్కాపురం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్‌డీ నారాయణరావు ప్రజలకు సూచించారు. శనివారం పట్టణంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో క్లీన్ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా జరిగిన కార్యక్రమాల్లో వారు పాల్గొన్నారు. విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఏపిఓ జీవరత్నం, వెలుగు ఏపియం పిచ్చయ్య, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొమరోలు: మండలంలోని 14 గ్రామ పంచాయతీల్లో ఇంకుడు గుంతల నిర్మాణం కోసం ప్రారంభోత్సవాన్ని చేపట్టారు. స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలో 343 ఇంకుడు గుంతలు మంజూరు కాగా వాటిని శనివారం ప్రారంభించారు. గోపాలునిపల్లె గ్రామంలో ఎంపీడీవో మస్తాన్ వలి, ఏపీవో మహాలక్ష్మి, ఈవోపీఆర్డీ బ్రహ్మయ్య పూజా కార్యక్రమాలు చేసి ప్రారంభించారు.

ఊరొకచోట.. బస్టాప్ మరో చోట

- ప్రజలకు ఉపయోగపడక ఇబ్బందులు

మార్కాపురం: పూర్వం చదువు రాని వారు ఆ ప్రాంతాన్ని సులభంగా గుర్తించేందుకు చెట్టు, పుట్టలను గుర్తు పెట్టుకుంటారు. అప్పటి పరిస్థితి అది. హైవే నిర్మాణ అధికారులు మళ్లీ పాతరోజులను గుర్తు చేస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోనికి వచ్చినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఊరు ఒక చోట ఉంటే.. మరో చోట షెల్టర్ ఏర్పాటు చేశారు. దీనితో అవి నిరుపయోగంగా మారాయి. ఊరికి దూరంగా ఏర్పాటుచేసిన బస్ షెల్టర్లు ప్రయాణికులకు, ప్రజలకు ఉపయోగపడటం లేదు. వానకు తడవకుండా, ఎండ వేడిమికి రక్షణగా ఏర్పాటు చేయాల్సిన బస్‌షెల్టర్లను నేషనల్ హైవే అధికారులు బస్‌లు ఆగని ప్రదేశంలో, ఊరికి దూరంగా ఏర్పాటు చేయటంతో నిరూపయోగంగా మారాయి. అధికారుల అనాలోచిత చర్య ప్రజలకు ఇబ్బందిగా మారింది. మార్కాపురం–పొదిలి మధ్య నేషనల్ హైవే మధ్య ఉన్న గ్రామాల వద్ద ఏర్పాటు చేసిన బోర్డులు వెక్కిరిస్తున్నాయి. నేషనల్ హైవే రోడ్డు వద్ద కలుజువ్వలపాడు గ్రామం దగ్గర ఏర్పాటు చేయాల్సిన బస్‌షెల్టర్‌ను నేషనల్ హైవేపై ఊరికి దూరంగా ఏర్పాటు చేశారు. బస్‌లు హైవే రోడ్డుకు, ఊరిలోకి వెళ్లే రోడ్డు కూడలిలో ఆగుతాయి. ప్రజలు కూడ అక్కడే బస్ కోసం వేచి ఉంటారు. ఇక్కడ ఏర్పాటు చేయాల్సిన బస్‌షెల్టర్‌ను ఊరికి 200 మీటర్ల దూరంలో ఏర్పాటు చేయటంతో షెల్టర్ పశువుల కాపరులకు, గొర్రెల పెంపకందారులకు మాత్రమే ఉపయోగ పడుతుంది. దీనితో వానకు తడుస్తూ.. ఎండకు ఎండుతూ బస్సుల కోసం ప్రయాణికులు వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అధికారులు ఇప్పటికైనా ప్రజలకు అందుబాటులో షెల్టర్‌ను ఏర్పాటు చేయాలి.


కలుజువ్వలపాడు గ్రామస్తులు బస్సు కోసం ఆగే కూడలి


ఊరికి దూరంగా ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్

కంభం సచివాలయంలో అందని సేవలు


సచివాలయంలో కూర్చొని ఉన్న కార్యదర్శి, పక్కనే ఖాళీగా ఉన్న కుర్చీలు

కంభం: కూటమి ప్రభుత్వంలో అధికారులను ఎలా వేధిస్తోందో మనందరికీ తెలిసిందే. కంభం–3 సచివాలయం పరిధిలో సిబ్బంది కొరతతో వివిధ రకాల పనులకోసం వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సచివాలయంలో 9 మంది సిబ్బంది ఉండగా డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు గత అక్టోబర్ నుంచి మెడికల్ సెలవులో ఉండగా, సర్వేయర్‌ను డిప్యూటేషన్ పై ఒంగోలు పంపించారు. తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ గత కొన్ని రోజులుగా సెలవులో ఉండటంతో అతని స్థానంలో ఇక్కడ పనిచేసే వీఆర్వోను తాత్కాలికంగా అక్కడికి పంపించారు. వీఏఏ రైతుసేవా కేంద్రంలో ఉండగా, మహిళా పోలీసు, ఏఎన్ఎంలు సర్వేలంటూ గ్రామంలో తిరుగుతుంటారు. ఇక సచివాలయంలో మిగిలింది పంచాయతీ కార్యదర్శి ఒక్కరే. అతను కూడా కొన్ని సార్లు జియోట్యాగింగ్, చిన్నపిల్లల ఆధార్ సర్వేల కోసం బయటకు వెళ్తుంటారు. ఆ సమయంలో కార్యాలయంలో ఖాళీ కుర్చీలు దర్శనమిస్తుంటాయి. గత కొన్ని నెలలుగా సచివాలయంలో ఇదే తంతు ఉండటంతో పలు సర్టిఫికెట్ల కోసం వచ్చే విద్యార్థులు, ఇతర సమస్యలు, అర్జీలు ఇచ్చేందుకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కార్యాలయంలో సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వెలుగొండలో భక్తుల సందడి


అలంకరణలో శ్రీవారు

కొనకనమిట్ల: ప్రసిద్ధ క్షేత్రం వెలుగొండ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. నమో వేంకటేశాయ నమోనమః అంటూ శ్రీవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తిరుమలాచార్యులు శ్రీలక్ష్మీ అలివేలుమంగా వెలుగొండ వెంకటేశ్వరస్వామి వార్లను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ఈఓ ఈదుల చెన్నకేశవరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వర స్వామి ఆలయంలో గోవిందా.. గోవిందా అంటూ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వెంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు అర్చనలు, అభిషేకాలు విశేష పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విజయకాంత్‌శర్మ భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి వార్లను వెండి కిరీటాలతో, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. కొనకనమిట్ల రామదూత క్షేత్రంలో వెంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకుడు వెంకటరామకృష్ణాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు.

వెలుగొండకు రూ. 2వేల కోట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న ఎమ్ఎల్ నారాయణ

మార్కాపురం: పశ్చిమ ప్రకాశానికి వరమైన పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు నిర్మాణ పనులకు వచ్చే బడ్జెట్‌లో రూ. 2 వేల కోట్లు కేటాయించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎమ్ఎల్ నారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని పూలసుబ్బయ్య శాంతి భవనంలో సీపీఐ కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వచ్చే బడ్జెట్‌లో వెలుగొండకు నిధులు కేటాయించాలని కోరుతూ ముంపు గ్రామాల బాధితులకు ఆర్ఆర్ ప్యాకేజీ మంజూరు చేయాలని కోరుతూ ఈనెల 17న మార్కాపురం సబ్‌కలెక్టర్ కార్యాలయం, కనిగిరి ఆర్డీఓ కార్యాలయాల వద్ద సీపీఐ ఆధ్వర్యంలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమారెడ్డి మాట్లాడుతూ దేశంలోనే దుర్భిక్ష పరిస్థితులు ఎదుర్కొంటున్న జిల్లా ఏదైనా ఉందంటే అది ప్రకాశం జిల్లా మాత్రమే అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎస్‌కె ఖాశీం, కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు సీపీఎం నేతల వినతి..

మార్కాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం త్వరలో ప్రవేశపెట్టనున్న బడ్జెట్‌లో వెలుగొండ ప్రాజెక్టుకు 2వేల కోట్లు కేటాయించి వచ్చే వరద సీజన్ నాటికి నీటిని విడుదల చేయాలని, ఇందుకోసం ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డికి సీపీఎం నాయకులు శనివారం వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం పార్టీ నాయకులు సోమయ్య, రఫీ, గుమ్మా బాలనాగయ్య, రూబెన్, రాజు, సురేష్‌కుమార్, నాగరాజు, నన్నేసా తదితరులు పాల్గొన్నారు.

డ్రాపవుట్స్ తగ్గించేందుకు ఉపాధ్యాయుల కృషి


మాట్లాడుతున్న ఎంఈవో రాందాస్ నాయక్

మార్కాపురం టౌన్: డ్రాపవుట్స్ తగ్గించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలని ఎంఈఓ రాందాస్ నాయక్ సూచించారు. శనివారం స్థానిక జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో క్లస్టర్ స్కూల్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించారు. 74 మంది ఉపాధ్యాయులు హాజరైన సమావేశంలో ఎంఈవో మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేలా చూడాలని, వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక క్లాసులు నిర్వహించాలని, 100 రోజుల ప్రణాళిక అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీహెచ్ఎం చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్ల పంపిణీ

అర్ధవీడు: విద్యార్థులు చదువులో కాకుండా ఆటల్లో కూడా ముందుండాలని పోలీసులు పేర్కొన్నారు. శనివారం కంభం సీఐ మల్లికార్జున, అర్ధవీడు ఎస్సై బీ సుదర్శన్‌లు అర్ధవీడు గ్రామంలోని డాక్టర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు క్రికెట్, వాలీబాల్, రబ్బీ క్రీడలకు సంబంధించిన కిట్‌లు అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి ఉపయోగపడటమే కాకుండా శారీరకంగా ధృఢంగా ఉంటారన్నారు. క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణిస్తే ప్రభుత్వ ఉద్యోగాల్లో అవకాశాలు ఉంటాయని చెప్పారు. ఈకార్యక్రమం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు కిట్లు పంపిణీ చేశామని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ బలరామిరెడ్డి, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేస్తున్న సీఐ, ఎస్సై

పొదిలిలో స్వర్ణాంధ్ర కార్యక్రమం

పొదిలి: ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేటట్లు చూసుకోవాలని నగర కమిషనర్ పి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం పట్టణంలో నగర కమిషనర్ ఆధ్వర్యంలో స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఇంట్లోని తడి, పొడి చెత్తను వేర్వేరు చేసి కార్మికులకు అందించాలన్నారు. రోడ్ల మీద ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకూడదని సూచించారు. అనంతరం విద్యార్థులు సచివాలయ సిబ్బంది, మున్సిపల్ కార్మికులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో శానిటరి ఇన్స్‌పెక్టరు మారుతిరావు, విద్యార్థులు, సచివాలయ, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ అధికారుల తనిఖీలు

పొదిలి:

పట్టణంలో శనివారం విద్యుత్ శాఖ అధికారులు తనిఖీలు చేశారు. 35 బృందాలుగా విడిపోయి పట్టణంలోని అన్ని వార్డుల్లో తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో 27 కేసులు నమోదు చేసి రూ.2.80 లక్షలు జరిమానా విధించినట్లు దర్శి ఈఈ పీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. అక్రమంగా విద్యుత్ వాడినా, దుర్వినియోగం చేసినా జరిమానా విధిస్తామని ఆయన హెచ్చరించారు. వినియోగదారులు సక్రమంగా మీటర్లు ఏర్పాటు చేసుకొని బిల్లు సకాలంలో చెల్లించాలన్నారు. కార్యక్రమంలో విజిలెన్స్ ఈ ఈ హైమావతి, పొదిలి ఏడీ ఈ దాండ్లపాటి హరిబాబు, ఏఈలు మోహన్‌రెడ్డి, ఏఈలు సిబ్బంది పాల్గొన్నారు.